
“భారతదేశంలో గ్రామం అనేది ఒకటిగా ఉన్న సామాజిక విభాగం కాదు.
గ్రామం అంటరానివారు, అంటతగినవారుగా విభజించబడి ఉంది,”
అన్నారు బాబాసాహెబ్ అంబేద్కర్. అంబేద్కర్ తెలియనివారికి భారతదేశం
గురించి ఏమీ తెలియదు. అంబేద్కర్ భావజాలాన్ని ఆమోదించనివాళ్లు
దళితుల్ని మనుషులుగా అంగీకరించనట్లే. ఈ కథ అదే సత్యాన్ని చెబుతుంది.

పి.వి. సునీల్‌కుమార్

5

# క్రైస్తవులు లేని చర్చి

అక్బర్





ఈశాన్యం మూల చిన్న గొయ్యి తవ్వి పని ప్రారంభించాడు ఆంజనేయులు. కొబ్బరికాయ కూడా కొట్టాడు కానీ తెల్లారుగట్లే ఎవరూ చూడకముందు కొట్టేశాడు.

ఏదైనా కట్టడం మొదలు పెట్టినపుడు ఈశాన్యం మూల తవ్వి నవధాన్యాలు... బలిసినవాళ్లయితే ముత్యాలు, బంగారం కూడా అక్కడ వేసి పూజ చేసి ప్రారంభించడం ఆనవాయితీ. బక్కోడైతే ఈ ఇల్లెలా పూర్తవుతుందా అని కార్చే రెండు చుక్కల కన్నీళ్లు కూడా ఆ గోతిలో కారుస్తారు. వీల్లైతే నిట్రాడు పాతి దానికి పూజ కూడా చేస్తాడు ఆంజనేయులు. అతడి తాత, ముత్తాత కూడా అలానే చేసేవారు. అసలు ఆంజనేయులు వంశంలో మగపిల్లలు తాపీ పట్టుకుని పుడతారు అని అనుకుంటారు ఆ చుట్టుపక్కల. అతడి పెదనాన్నలు, చిన్నాన్నలు బంధువులు అందరూ తాపీగా బతక్కపోయినా తాపీ పనిచేసే బతుకుతూంటారు. అందరూ ఈ ఆనవాయితీ తప్పక పాటిస్తారు.

కానీ ఇక్కడ ఆ వీల్లేదు. అంటే ఆంజనేయులు ఏదో అమాంతం పేద్ద కాంట్రాక్టరు అయిపోయి నెల్లూరు రెడ్లకి మల్లే ఆఫ్ఘని స్తానులో కాంట్రాక్టు పట్టేశాడని కాదు. ఆ మాటకొస్తే ఆంజనేయులు పనితనానికి అమెరికావాడు కూడా తెల్ల ఇల్లు కట్టేపనో, రిపేరీనో ఇవ్వాల్సిందే.

అందుకే అతడికి వైట్‌హౌస్ కాకపోయినా చర్చీ కట్టే కాంట్రాక్టు వచ్చింది.

ఆ చుట్టుపక్కల అదే పెద్ద చర్చి- చర్చి ఆఫ్ సౌత్ ఇండియా అంటే సియస్ఐ మిషను వాళ్లది. గతంలో రాయి, సున్నం కట్టుబడితో, పైన ఎర్రని పెంకుల కప్పుతో, కప్పు మీద సిమెంటు సిలువతో చాలా గొప్పగా ఉండేది. ఓ పక్కన గుడిగంట... ఎప్పటిదో. చర్చి చుట్టూ ఎర్రనిపూలు పూసే బోగన్ విలియాలు. అసలు చర్చి కాంపౌండులోకి వస్తేనే గొప్ప శాంతిగా ఉండేది.

చర్చి బిల్డింగుకి కూడా వయసై కూలిపోబోయింది. ఎంత దేవుడిని నమ్ముకున్నా మనిషికి ఆ దేవుడు జ్ఞానం ఇచ్చింది వాడుకోవడానికే అన్న విషయం చాలా గట్టిగా గుర్తుకు వచ్చేయడం మొదలైంది ఆ గుడికి వచ్చేవారందరికీ. ప్రార్థనల మధ్యలో టప్‌మని పైనుండి ఓ పెంకో, బెడ్డో పడటం, చర్చిలో ఉన్నవాళ్లంతా పొలోమని ఏసు ప్రభువు రెండో రాకడ వచ్చేసినట్టు వణికిపోతూ పైకి చూడ్డం ప్రతీ ఆదివారం మామూలైపోయింది.

చర్చికి వెళ్లి వచ్చినపుడల్లా దేవుడి రాజ్యానికి వెళ్లి వచ్చినంత పనికావడంతో కొత్త చర్చి కట్టాలనే డిమాండు ఊపందుకుంది.

''ఏదైనా ప్రయాణం చేసివచ్చినపుడు క్షేమంగా వెళ్లిరావడానికి కృప చూపించిన ఆ దేవుడికి స్తోత్రాలు చెప్పుకుంటాం. కానీ చర్చికి వెళ్లి క్షేమంగా తిరిగి రాగలినందుకు ఇంటికి రాగానే ప్రార్థన చేసుకుంటున్నాం,'' అన్నారు మనష్షేగారు, ఆయన సంఘపెద్ద.

''ఆ మాట నిజమేనండే... ఏసుప్రబువు కోసం కూడా అన్నిసార్లు పైకి చూసుండం. దీనమ్మా. ఎప్పుడు పడిపోద్దా అని అత్తమాలూ ఆ కప్పెంక చూడ్డమే,'' అన్నాడు ఇస్రాయేలు.

దేవుడంటే అందరికీ ఇష్టమే... పరలోక ప్రవేశం కోసం అనుదినం ప్రార్థిస్తారు. కానీ పరలోక ప్రయాణాన్నే ఎప్పుడూ వాయిదా వేద్దామని ప్రయత్నిస్తారు. చర్చి కప్పు లోంచి పరలోకానికి నేరుగా పోవచ్చు అని ఎదురుగా కనపడుతోంటే భయపడతారు. మానవుని విశ్వాసము ఎంత బలహీనమో కదా. మనిషికి ఉన్న జ్ఞానం మీద కంటే దేవుడి యొక్క శక్తి మీద విశ్వాసం ఉంచమని కొరింథీయులకు రాసిన పత్రికలో దేవుడు చెప్పాడు.

చర్చి నిధులపై చర్చికి పెత్తనం ఉండదు. దానికి డయాసిస్ అని ఒకటి ఉంటుంది. మేత్రాసనం అంటారు తెలుగులో. మేత్రాసనం సంఘాలు అన్నింటినించి వచ్చిన డబ్బుని తన అధీనంలోకి తీసుకుని తిరిగి వారి అవసరాలకు ఇస్తుంది. పాస్టర్లకు జీతాలు, చర్చిల కరెంటు బిల్లులు, రిపేరు వంటి సాధారణ పనులకు, ఖర్చులకే కాకుండా చర్చిల నిర్మాణం వంటి వాటికి కూడా మేత్రాసనమే కొంత డబ్బు ఇస్తుంది. చిన్న సంఘాలు... అంటే చిన్న పల్లెల్లో ఉండే చర్చిల నుండి వచ్చే రాబడి తక్కువగా ఉంటుంది. పెద్ద పట్టణాల్లో ఉండే సంఘాల ద్వారా వచ్చే ఆదాయం సహజంగానే ఎక్కువగా ఉంటుంది.

ముఖ్యంగా ఉద్యోగస్తులు ఉండే చోటు నుండి ఎక్కువ రాబడి వస్తుంది.

ఇలా వచ్చే ఎక్కువ తక్కువల్ని సమం చేసి అన్ని సంఘాల అవసరాలూ చూసుకోవడం మేత్రాసనం పని.

అయితే... ఇలా చర్చి కట్టడం లాంటి పెద్ద పని పెట్టుకున్నపుడు సంఘం నుండి పెద్ద మొత్తంలో విరాళాలు డబ్బురూపంలో కానీ వస్తురూపంలో కానీ తీసుకోవడం రివాజు,

ఒక ఆదివారం ప్రార్థన సమావేశంలో పాస్టరు ఏసురాజుగారు, సంఘపెద్ద మనష్షేగారు, సంఘ కాపరి కొరింథిగారు, మేత్రాసనం నుండి వచ్చిన రెవరెండు పాస్టరు గారు దేవుని చిత్తమైనందువల్ల పాత చర్చి స్థానంలో కొత్త చర్చి కట్టబోతున్నామని ప్రకటించారు. సంఘం విరివిగా విరాళాలు ఇవ్వడంతో పాటు ఆ ప్రాంతం నుండి వెళ్లి పెద్ద ఉద్యోగాలు చేసుకుంటున్న వారిని, అన్యమతస్తులు అయినా విరాళాలు ఇచ్చే కామందుల్నీ చర్చి నిర్మాణానికి సహకారం కోసం కోరాలని కూడా ప్రకటించారు.

నిరుడు తుని దగ్గర బస్సు ప్రమాదం జరిగినపుడు ముగ్గురు చనిపోయినా దేవుడు ఆశ్చర్యకరమైన రీతిలో రక్షించిన సరోజినమ్మగారి రెండో కొడుకు, కోడలు, మనమడి నిమిత్తం తనవంతుగా వంద కట్టలు సిమెంటు ఇస్తానని చెప్పగానే అందరూ చప్పట్లు కొట్టారు.

నతానేలుగారి పెద్ద కొడుకు బెంగుళూరు ఇన్ఫోసిస్‌లో పనిచేస్తూ ప్రమోషన్ మీద అమెరికా వెళ్లాడు. దేవుడు తనను దీవించిన దానినిబట్టి నతానేలు గారు కొడుకు తరపున యాభై వేల రూపాయలు తన వంతుగా ప్రకటించాడు.

బిడ్డ గర్భసంచీలో అడ్డం తిరిగినా సిజేరియన్ లేకుండా ప్రసవించిన రూబేలమ్మ కోడలు పాతికవేలు, రెండోసారి గుండెపోటు వచ్చినా నిక్షేపంగా ఉన్న యాకోబుగారు పదివేలూ- ఇలా దేవుడి వల్ల అనేక ఈవులను పొందిన వారంతా తమ కృతజ్ఞతా అర్పణలను కొత్త ఆలయం కట్టబోతున్న సందర్భంగా దేవుడికి తిరిగి చెల్లించడానికి ముందుకొచ్చారు.

ఇలా సంఘం తరపున వచ్చిన కానుకలు, ఇచ్చిన విరాళాలు, మేత్రాసనం ఇచ్చిన కొంత మొత్తం అంతా కలిపి కొత్త దేవాలయం కట్టుకోవడం మొదలైంది.

సంఘస్తులంతా కలిసి శ్రమదానం కూడా చేసి గుడిని కట్టాలని నిర్ణయించారు.

❖

చర్చి కట్టడానికి మొనగాడెవడా అని చూస్తే ఆంజనేయులు కనిపించాడు వాళ్లకి. తాపీపని చెయ్యడమే కాకుండా, వడ్లాబత్తులతో కిటికీలు, ద్వారబంధాలు కూడా చేయించుకుంటాడు. ఎలక్ట్రీషియన్ పనిచేసే వాళ్ల బంధువుల కుర్రాడ్ని పురమాయించుకుని వైరింగు వేయించడమే కాకుండా లైట్లు, ఫాన్లు కూడా బిగించేసుకుంటాడు.

గంట మాత్రం పాతదే వాడాలని నిర్ణయించినా, సిమెంట్ సిలువకు బదులుగా నియన్ లైట్లు పెట్టిన మెటల్ సిలువ అమెరికా నుండి నతానేలుగారి కొడుకు పంపేది బిగించుకుంటాడు.

ఇన్ని చేయగలిగినోడికే కాంట్రాక్టు ఇవ్వాలని సంఘకాపరులు నిర్ణయించారు.

ఆంజనేయులు హిందువు, డబ్బులిస్తే మసీదైనా కట్టిపెడతాడు. అతడికి మత అసహనం లేదు. నమ్మిన మతాన్ని పూర్తిగా నమ్ముతాడు.

కాంట్రాక్టు వచ్చినపుడు అతడు వినయంగా, "ఎవరైతేనేం అయ్యా. దేవుడు దేవుడే. అందుకే చాలా న్యాయంగా పోతాను ఈ కాంట్రాక్టులో, మిగతాచోట్ల తీసుకునే దానికంటే పదిరూపాయలు తక్కువే తీసుకుంటా," అన్నాడు సంతోషంగా.

అతడు అన్నమాట ప్రకారమే చాలా న్యాయంగా తన పనివాళ్ల రేటూ, తన కమీషనూ, వడ్డాబత్తులు, కరెంటు పనీ అన్నీ చాలా తక్కువకి మాట్లాడిపెట్టాడు.

❖

ఆంజనేయులుకి పెళ్లయి సుమారు ఏడు సంవత్సరాలు కావస్తోంది. భార్య కూడా దగ్గరి బంధువుల అమ్మాయే. తాగుడు కానీ వాగుడు కానీ అలవాటు లేని ఆంజనేయులు తన భార్య వరలక్ష్మితో, చాలా ఒద్దికగానే ఉంటాడు. ఆ అమ్మాయికి కూడా ఆంజనేయులు అంటే ప్రాణం,

కానీ చిన్న లోటేంటంటే... ఆంజనేయులుకి పిల్లల్లేరు. వాళ్లు చూడని డాక్టరు లేడు, మొక్కని దేవుడు లేడు. ఏ లోపమూ లేదంటుంటే ఆంజనేయులుకీ, వరలక్ష్మికీ దుఃఖం పెరిగిపోతోంది. ఏదైనా లోపం ఉంటే మందో మాకో వాడి పిల్లనో, జెల్లనో కనొచ్చు. కానీ ఏ లోపం లేదంటే ఎలా?

ఇంకో పక్క ఆంజనేయులు తల్లికి కడుపులో కాన్సర్ ఉందని తేలింది. ఆమె ఎక్కువ కాలం బతకదని తేల్చి చెప్పారు.

ఆమె చనిపోయేలోగా మనవడినో మనుమరాలినో ఎత్తుకోవాలని ఆశ పడుతోంది.

బిడ్డ పుట్టాలన్నా బిల్డింగ్ కట్టాలన్నా కొంత టైమ్ తీసుకోక తప్పదు. తొమ్మిది మంది ఆడాళ్లని ఏకకాలంలో గర్భవతుల్ని చేయడం ద్వారా నెలరోజుల్లో బిడ్డని పుట్టించలేవు అని వారెన్ బఫెట్ ఆంజనేయులుతో అనలేదు. అసలు అమెరికా వారెన్ బఫెట్‌కీ అంగలకుదురు ఆంజనేయులుకీ పెద్ద పరిచయం లేదు.

కానీ పదిమంది బదులుగా వందమంది కూలీల్ని పెట్టినంత మాత్రాన మూడు నెలల్లో బిల్డింగ్ కట్టలేమని ఆంజనేయులుకి ఎవడూ చెప్పఖ్ఖర్లేదు.

తల్లికి తన పిల్లనో పిల్లాడినో చూపించాలంటే ఆవిడ కనీసం ఒక సంవత్సరం బతకాలి, అది ఒక అద్భుత కార్యమే. డాక్టర్లు చెప్పిన ప్రకారం ఆంజనేయులు తల్లి ఆర్నెల్లు బతికితే గొప్ప. ఆల్రెడీ ఆంజనేయులుకి ఎక్కడైనా ఓ పిల్ల ఉంటే తప్ప ఆవిడ కొడుకు సంతుని చూసే అవకాశం లేదు. కానీ ఆంజనేయులు పేరుకు తగ్గవాడు. అనగా బ్రహ్మచారి అని కాదు సుమా, కేవలం భార్యకు మాత్రమే పరిమితమైనవాడు. ఇసుకా సిమెంటు లాగా ఇద్దరూ కలిసిపోయారు.

పాత చర్చి కూల్చేసి ఆ రాయి రప్ప ఎత్తేశారు. కలప మాత్రం వేలం వేయగా కొంత సొమ్ము జమ అయింది.

చర్చీ పని ధూంధాంగా ప్రారంభమైంది. షామియానాలు, వాటి కింద కుర్చీలు వేసి అందరూ కూర్చున్నారు. పెద్ద పాదిరిగారు స్టేజీ ఎక్కి వాక్యం చదివారు. ప్రసంగాలు చేశారు. పెద్ద పాదిరిగారు, పాస్టరుగారు కొత్త అంగీలు వేసుకువచ్చి ప్రార్థనలు చేశారు. ఫలానా పెద్ద పాదిరిగారు వచ్చి ఈ చర్చికి పునాది వేశారని ఫలకం దిగేశారు. షామి యానా కింద చేరిన క్రైస్తవులంతా హల్లెలూయా అని మోతెక్కించేశారు.

క్రైస్తవుల్లో కమ్మవారున్నారు, రెడ్లున్నారు. కొంతమంది వడ్డాబత్తులు, కంసాలి కుటుంబం ఒకటి, చాకళ్లు నలుగురు. ఇలా నానాజాతి సమితి ఉందక్కడ.

మొత్తానికి ఇది బలే మతం లాగుంది అనుకున్నాడు ఆంజనేయులు. అన్ని కులాలోళ్లూ అన్నదమ్ముల మాదిరిగా ఒక్కచోట చేరారు. అందర్నీ ఏకం చేసిన మతం లాగుంది ఇది అనుకున్నాడు.

పని ప్రారంభమయ్యాక చూడాలి ఇక అన్నదమ్ముల ఐకమత్యం, జాకబులు ముగ్గురున్నారు ఆ గుంపులో. జాకబు, కమ్మవారి జాకబు, మాల జాకబు.

జాకబులంతా ఒక్కటై సిమెంటు తట్టలు అందిస్తున్నారు ఆంజనేయులు దగ్గర పనిచేసే పనోళ్లకి. ఇనపరాడ్లు ఫౌండేషన్లోకి దింపుతుంటే ముగ్గురూ తలో  చెయ్యి వేస్తున్నారు.

సిటీల్లో అయితే రడీమిక్సు కాంక్రీటు అని దొరుకుతోంది ఈమధ్య. అంటే సిమెంటూ, ఇసికా, నీళ్లూ వాడే పాళ్ల ప్రకారం కలిపేసి ఒక ట్రక్కుడు డ్రమ్ముతో తెచ్చి బోర్లించేస్తాడు. కూలోళ్ల కడుపు కొట్టడానికి వంద మార్గాలు. అందుకే యంత్రాలు ఎక్కడ వాడాలో అక్కడ వాడండి, అవసరం లేని చోట్ల వద్దని గాంధీగారు అన్నారు. టాయిలెట్ల శుభ్రం చేయడానికి యంత్రాలు కావాలి, కాంక్రీటు కలపడానికి కాదు. కానీ మనం ముందు కాంక్రీటు కలపడానికే యంత్రం కొంటాం.

అయితే ఆంజనేయులు దగ్గర చిన్న మిక్సింగు యూనిట్లు ఉన్నాయి. వాటిని మనుషులే తిప్పాలి. వాలుగా పెట్టిన గమేళా లాంటి దాంట్లో సిమెంటు, చిప్పు (అంటే

లే చిప్పు కాదు రాతిముక్కలు), ఇసుక వేసి ఆనక నీల్లు సమంగా పోసి దానికి ఉన్న హాండిల్ పట్టుకుని ఇద్దరు మనుషులు తిప్పితే అన్నీ సమంగా కలిసిపోతాయి. ఆనక గమేళా వంపేసుకుని తట్టలకెత్తుకుని బీమ్సుకి, కాలమ్సుకి లేదంటే స్లాబుకి వేసేసు కోవడమే.

మిక్సింగుకి కూలీల్ని పెట్టుకున్నా వాళ్లకి ఇసుకా, సిమెంటు, చిప్పు, నీళ్ల అందించడానికి సంఘస్తులు ముందుకు వచ్చారు.

మూడు కులాల జాకబులు ముచ్చటగా కలిసి పనిచేస్తున్నారు. కమ్మవారి ఆడపడుచులు పనిచేసేవారి కోసం పులిహోర అనీ, పరమాన్నం అనీ, పెరుగు బువ్వ అనీ పట్టుకొస్తున్నారు. రెడ్ల ఆడంగులు టిపినీలు అని చెప్పి, పూరీలు, చపాతీలు వాటిల్లోకి శనగపప్పు పచ్చడి, కొబ్బరి చట్నీ, బంగాళాదుంప కూర అందిస్తున్నారు.

అన్ని కులాలోళ్లూ ఆ వంటలు ఆరగిస్తా, చమటోడ్చి పనిచేస్తా ఉన్నారు.

ఆంజనేయులుకి చిన్నప్పుడు చదువుకున్న పాఠాల్లోని భిన్నత్వంలో ఏకత్వం అనేది గుర్తుకొచ్చింది. అందరూ ఎంత  బాగా కలిసిపోయేరు. ఒకప్పుడు మాల మాది గల్ని పక్కకు రానిచ్చేవాళ్లు కూడా కాదు. అలాంటిది ఇప్పుడు అంతా భుజం, భుజం కలిపి ఎంచక్కా పని చేస్తున్నారు.

❖

రోజూ పొద్దుటే తన ఇష్ట దైవం ఆంజనేయస్వామికి పూజ చేసుకుని, నుదుట బొట్టు పెట్టుకుని చర్చి పనికి బయలుదేరుతుంటే వరలక్ష్మి అంది, ''ఈ చర్చి పని పూర్తయ్యేలోపల నేను నీళ్లోసుకుంటే ప్రభువుని నమ్ముకుంటానయ్యా,'' అని.

''చూద్దాంలే... ప్రభువు దయవల్ల అదే జరిగితే అలాగే చేద్దాం,'' అన్నాడు ఆంజనేయులు.

ఆ తర్వాత అతడికి గుబులు పట్టుకుంది. ఒకవేళ నిజంగా పెళ్లాం నీళ్లోసు కుంటే మతం మారాలా? వరలక్ష్మి ఒకత్తి మారిపోతే సరిపోతుందా? తను కూడా మారాలా?

ఇలా అనుకున్నాక ఎందుకన్నా మంచిదని అక్కడ పనిచేసే క్రైస్తవులతోటీ, పాదిరిగారితోటీ మాటామంతీ కలపడం మొదలెట్టాడు.

''పాదిరిగారూ... మా హిందువుల్లో చాలామంది దేవుళ్లుంటారు. ముక్కోటి దేవతలు అంటారు. ఇష్టమైన కూర ఉన్నట్టు, ఇష్టమైన దేవుడిని ఎన్నుకోవచ్చు. వారంలో రోజుకో దేవుడికి పూజ చేసుకోవచ్చు. ఒకళ్ల దగ్గర పని కాకపోతే ఇంకో దేవుడి

దగ్గరికి పోవచ్చు. మరి మీ మతం పుచ్చుకున్నాక అలా కుదురుతుందాండీ?'' అని అడిగాడు ఆంజనేయులు చర్చి పనులు చూస్తూ నిలబడ్డ పాదిరి ఎహెజ్కేలుగారిని.

''నేను తప్ప వేరే దేవుడు లేడు అని యెషయా గ్రంథం 43వ అధ్యాయం పదమూడో వచనంలో ఏసు ప్రభువు చాలా స్పష్టంగా చెప్పారు ఆంజనేయులుగారూ,'' అన్నాడు ఎహెజ్కేలు.

''అయితే ఏసుప్రబువు బొమ్మకి తప్ప ఏ ఇగ్రహానికి మొక్కకూడదన్నమాట,'' అన్నాడు ఆంజనేయులు

''నిర్గమకాండం గ్రంథం ఇరవయ్యవ అధ్యాయం నాలుగవ వచనంలో చాలా స్పష్టంగా ఉంది. ఈ లోకానికి కానీ పరలోకానికి కానీ చెందిన ఎలాంటి బొమ్మలు, విగ్రహాలూ పూజకోసం తయారుచేయకూడదు అని. ప్రభువుని మనసులో అనుకోవాలి తప్ప ఎదురుగా విగ్రహం పెట్టుకోకూడదు,'' ఓపిగ్గా చెప్పాడు ఎహెజ్కేలు.

''మరి మాలో బేమ్మలు, కోవిట్లు, రాజుల్లా రెండుసార్లు పుట్టినోళ్లు ఒక్కసారే పుట్టే రెడ్లు, కమ్మలు, మాలాంటి శూద్రులు ఇంతమంది చచ్చారు మా హిందూ మతంలో. మరి కిష్టియన్లలోనండే?'' అడిగాడు ఆంజనేయులు

''క్రైస్తవంలో అందరూ క్రీస్తు బిడ్డలే. రంగుని బట్టి, జాతిని బట్టి వేరు చేయడం ఉండదు. కులం ప్రసక్తే లేదు. అందరూ ఒకటే కులం, క్రైస్తవ కులం. ఒకటే మతం క్రైస్తవ మతం. ఒకడే దేవుడు. ఏసుక్రీస్తు. ఒకటే పవిత్ర గ్రంథం, బైబిలు. అంతా ఆదాము అవ్వ సంతానమే. ఆడ, మగ భేదం మాత్రమే దేవుని సృష్టిలో ఇంకా క్రైస్తవంలో ఉంది,'' ఓపిగ్గా వివరించాడు ఎహెజ్కేలు,

'అయ్యబాబోయ్... కిరస్తానీ మతం అంటే ఆషామాషీ కాదనమాటండి... ఇగ్రహం లేదు... పూజ లేదు... కులం కూడా లేదు,'' అన్నాడు ఆంజనేయులు. అతనికి ఆ మతం మీద గౌరవం పెరిగింది.

ఇలా చర్చిపని మొదలైందో లేదో... ఏ ముహూర్తాన వరలక్ష్మి మొక్కుకుందో కానీ (ఏసుప్రభువు ముహూర్తాలు చూస్తారా?) ఆ ప్రభువు ఆంజనేయులు దంపతుల్ని దీవించాడు.

వరలక్ష్మి నీళ్లోసుకుంది.

అక్కడికే దిమ్మ తిరిగిన ఆంజనేయులికి ఇంకో రిమ్మతిరిగే విషయం ఎదురైంది.

దేవుడు అప్పుడపుడూ మేజిక్కులు చేయడం మరిచిపోవచ్చు కానీ డాక్టర్లు మాత్రం మరిచిపోరు. ఆంజనేయులు తల్లిని బెజవాడలో పెద్ద డాక్టరు దగ్గరికి తీసుకెళితే ఆయన ఆవిడకి కేన్సరు కాదని అలా కనపించిన అల్సరు అని తేల్చారు.

అంతే... ఆంజనేయులు కుటుంబం మొత్తం ఏకమొత్తంగా క్రీస్తుని నమ్ము కున్నారు. ఆంజనేయులు తల్లి మనమడు మత్తయ్యను ఎత్తుకుంది.

ఆంజనేయులు ఆశీర్వాదంగా మారిపోయాడు. వరలక్ష్మి మార్తమ్మగా మారింది.

❖

ముందే అనుకున్నట్టు ఆంజనేయులు... క్షమించాలి ఆశీర్వాదం ఏ మతంలో ఉన్నా నిజాయితీగా ఉంటాడు. ఇప్పుడా గొడవ ఎందుకొచ్చిందో చెప్పుకుందాం.

చర్చి పని పూర్తయింది. ఆశీర్వాదంలో, అతడి కుటుంబంలో భక్తి పెరిగింది.

చర్చి పని పూర్తయింతర్వాత బిలబిలమంటూ చర్చిలోకి ప్రవేశించారు సంఘస్తులు. ఏదో ముందే అనుకున్నట్టుగా, కమ్మవారు మాత్రం కుడివైపు బల్లల మీద కూర్చున్నారు. మాల మాదిగలు ఎడమవైపు కూర్చున్నారు. రెండు వరసలకీ మధ్య రెండడుగుల ఎడం. ఎప్పటికీ తరగని రెండు యుగాల ఎడం.

ఆశీర్వాదానికి మాట పడిపోయింది, తనెక్కడ కూచోవాలో అర్థంకాక జేబు లోంచి తన మొబైల్ ఫోన్ తీసుకుని పెద్ద మేస్త్రీ, మాయా మందిరం కట్టిన మయుడు ఫోన్ చేసినట్టు దానెంక చూసుకుంటూ బయటకొచ్చి చెట్టు కింద నిలబడ్డాడు.

చర్చీ అయ్యాక బయటకి వచ్చిన జాకబు రెడ్డిని అడిగాడు. గారపాటి జాకబు చౌదరిని అడిగాడు. మీరు క్రిస్టియన్లు అయితే మీ పేర్లలో ఈ కులాలెందుకని, మీరూ మాల జాకబూ ఎడమెడంగా ఎందుకు కూచుంటున్నారని.

“ఇంటి పేరు అనేది మనం ఎంత గొప్ప కుటుంబం నుంచి వచ్చామనేది చెప్పడానికి ఉపయోగపడుతుంది. అది దేవుని చిత్తం... ఆశీర్వాదం. అలాగే పేరు చివర రెడ్డి, కమ్మ అనేది లేకపోతే జాకబుగాడు మాలోళ్ల కుర్రాడో, రెడ్ల కుర్రాడో, కమ్మవారి అబ్బాయో ఎలా తెలుస్తుంది? తెలిస్తే కదా ఎంత గౌరవం ఎవరికి ఇవ్వాలో తెలిసేది,” అన్నారు.

అదే ప్రశ్న మాలోళ్ల జాకబుని అడిగితే... “ఏంటో ఆంజనేయులా... సారీ... ఆశీర్వాదమా... ఏంటో మా తాతతోటి చర్చికి వచ్చినపుడు ఆడు ఎడం ఏపు కూచునే వోడు. నాకూ అదే అలవాటైంది. జాకబు రెడ్డి తాత, జాకబు చౌదరి తాతా కుడెంపున కూచునేవోళ్లు... ఆళ్ల తాతల్తో వచ్చీ వచ్చీ ఆళ్లకి అటు కూచోడం అలవాటైంది... అలా మాలమాదిగలు ఎడంవైపున, కమ్మ, రెడ్లు, బ్రామ్మలు కుడెంపున కూచోడం రివాజైంది,” అన్నాడు.

“మరి అందరూ క్రిష్టియనే కదా... రెడ్లు, కమ్మోరు, బేమ్మలు మీతో సంబంధాలు కలుపుకోరా?” అడిగాడు .

మాలోళ్ల జాకబు ఓ నవ్వు నవ్వి పేటవైపు వెళ్లిపోయాడు.

కలిసి కూచోడానికే ఇష్టం లేనోళ్లు ఇక సంబంధాలేం కలుపుకుంటార్రా ఎర్రోడా అని ఆ నవ్వుకి అర్థం అని ఆశీర్వాదానికి తోచింది.

ఆశీర్వాదం ఆ చర్చీలోకి వెళ్లటం లేదు. ఇంట్లోనే ప్రార్థన చేసుకుంటున్నాడు.

బుడ్డోడు మత్తయ్యను ఆడించుకుంటున్న ఆశీర్వాదాన్ని అడిగాడు ఆళ్ల బామ్మర్ది వరసయ్యే రాజుబాబు, "బాయ్యా... నువ్వు మతం పుచ్చుకున్నావు కానీ చర్చికి ఎళ్లడం లేదు... ఏంటి బాయ్యా ఎందుకూ?" అని.

"గుంటూర్లో కులానికో వెంకటేశ్వరస్వామి ఉన్నాడు... ఆ గుళ్లని కూడా కమ్మ వెంకటేశ్వరస్వామి గుడి అని... కోమట్ల వెంకటేశ్వర స్వామి గుడి అని అంటారు... అదే ఇక్కడికి వచ్చినట్టుంది... నాకు నజరేయుడైన ఏసుప్రభువు ఒక్కడే ప్రభువు. ఈళ్లకి ఆ ఏసు ప్రభువు ఎదురైతే నువ్వు రెడ్ల ఏసువా? కమ్మవారి ఏసువా? మాలోళ్ల ఏసువా అని అడిగే రకాలు. అక్కడ లోపల క్రైస్తవులు ఎవరున్నారని? అక్కడ ఉన్న దంతా రెడ్లు, కమ్మలు, మాలలు, మాదిగలు," అన్నాడు ఆశీర్వాదం.

ఆనక "ఏసు... నీ నామామృతము మా..కేంత రుచి అయ్యా..." అని కాంభోజి రాగంలో యోసేపు దానియేలుగారు రాసిన కీర్తన పాడుకుంటూ కూచున్నాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*6 మార్చి 2016*

*



పి.వి. సునీల్‌కుమార్ పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడిలో పుట్టారు. వయస్సు 48. వీరి మొదటి కథ **మూషికార్జునీయం** స్వాతి వార పత్రికలో 1986లో అచ్చయింది. ఐజి స్థాయి ఐపిఎస్ అధికారి. *50*కి పైగా కథలు, మూడు నవలలు రాశారు. నీలవేణి కథాసంపుటి ప్రచురించారు. వీరి దెయ్యం కథను వీకెండ్ మూవీ మేకర్స్, రోహిత్‌శర్మ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించారు.

*చిరునామా: 102, శ్రీనివాస రెసిడెన్సీ, హిమాయత్‌నగర్*
*హైదరాబాద్-500 029*
*ఫోన్: 94407 17171* **sunil999@gmail.com**